17 వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
గురువారం | 23 మే 2024 | పేజీలు 9

# అమ్మవారి సేవలో శారద మఠం పీఠాధిపతి స్వరూప నందేంద్ర సరస్వతి



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని బుధవారం విశాఖ శారద మఠం పీఠాధిపతి స్వరూప నందేంద్ర సరస్వతి, వారి శిష్య బృందంతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ముఖ ద్వారం వద్ద వారికి ఆలయ అర్చకులు అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరిం టెండెంట్ వెంకటరమణ, ప్రసాదాలు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏవీఎస్ సతీష్, అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.

# ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

## - తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

**తిరుమల, మేజర్ న్యూస్:** ఏపీలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వంతో మంచి సత్సంబంధాలు కలిగి ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించానన్నారు. బుధవారం ఉదయం విఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ గుండా ఆలయ ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ మహా ద్వారం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు రేవంత్ రెడ్డికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరించిన అనంతరం తెలంగాణ సీఎం శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. సీఎం హెూదాలో రేవంత్‌రెడ్డి మొదటి సారి శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఆలయం వెలుపుల సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు సౌకర్యార్థం... కళ్యాణ మండపాలు, సత్రాలు నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం టీటీడీకి సహకరిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. నీటి సమస్యలు తీరి సకాలంలో వర్షాలు కురుస్తున్నాయన్నారు.





శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కుటుంబ సభ్యులు

# ఘనంగా ముగిసిన గంగ జాతర

## - అమ్మవారి విశ్వరూప దర్శనంతో పులకించిన భక్తజనం

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** శ్రీతాతయ్యగుంట గంగమ్మజాతర మహెూత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఏడు రోజులు గంగమ్మ జానపద జాతరతో లక్షలాది మంది భక్తజనం అత్యంత భక్తి శ్రద్ధలతో గంగమ్మతల్లిని దర్శించుకొా మొక్కులు తీర్చుకున్నారు. రోజువారీ వేషధారణలతో భక్తులు సందడితో నగర నీధులు హెూరెత్తాయి. కోరను కోర్కెలు తీర్చే కల్ప వల్లి అయిన గంగమ్మతల్లి పట్ల అత్యంత భక్తి ప్రపత్తులతో కుటుంబ సమేతంగా వక్తజనల పొంగళ్లతో గంగమ్మతల్లికి నైవేధ్యాలు సమర్పించి ప్రణమరిల్లి అమ్మవారికి మ్రొక్కులు చెల్లించుకు న్నారు. ఏ రోజులు తిరుపతి నగరవీధులు గంగమ్మ నామ స్మరణలు, జాతర వేషాల సందడి, డప్పుల ధరవులమోతతో హెూరెత్తింది. ప్రభుత్వం తిరుపతి గంగ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏట కూడా. జాతర భక్తజనసందోహంతో హెూరెత్తింది. గంగజాతర చివరి రోజైన మంగళవారం అర్థ రాత్రి తర్వాత శ్రీతాత య్యగుంట గంగమ్మ ఆలయంలో ప్రత్యేకంగా కొలువు తీరిన గంగమ్మ విశ్వరూప ప్రతిమ దర్శనంతో భక్తజనం పులకించారు. భక్తులు భక్తి పారవశంతో గంగమ్మ తల్లీ... కరుణించి కాపాడు తల్లీ అంటూ అమ్మవారి విశ్వరూపాన్ని చేతులెత్తి మొక్కుతూ వేడుకున్నారు. ఈనెల



02 పేజీ

# కౌంటింగ్ సూపర్వైజర్, అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

## - కౌంటింగ్ విధులు కేటాయించిన అధికారులు అందరు బాధ్యతగా పని చేయాలి

## - కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికలు - 2024 ప్రక్రియలో భాగంగా జూన్ 4వ తేదీన నిర్వహించే కౌంటింగ్ నందు ఆయా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్వీ యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియం నందు ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎఆర్ఓ లు, కౌం టింగ్ సూపర్‌వైజర్లకు, సహాయకులకు, మైక్రో అబ్జర్వర్స్‌లకు జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ విధానంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4 వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలు- 2024 ఓట్ల లెక్కింపు విధానంలో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు కీలక పాత్ర వహించి కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. శ్రీ పద్మావతి



మిగతా 2లో



## జిల్లా నోడల్ అధికారిగా

# ఆరిఫుల్లా నియామకం

## - జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు వెల్లడి

**చిత్తూరుక్రైమ్, మేజర్‌న్యూస్:** ఏపీ రాష్ట్రహై కోర్టు ఆదేశాల మేరకు పశువుల, జంతువుల సంరక్షణ చట్టాల అమలుకు చిత్తూరు జిల్లాకు నోడల్ అధికారిగా జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్. ఆరిఫుల్లాను నియమించినట్లు జిల్లా ఎస్పీ వీఎన్. మణికంఠ చందోలు బుధవారం తెలిపారు. జంతువుల అక్రమ రవా ణా అక్రమ వధ విషయంలో ప్రజలకు ఏవిధ మైన సమాచారం గాని, ఏదైనా ఇబ్బందిగాని జరిగినట్లయితే ప్రత్యక్షంగా, ఫోన్ ద్వారా జిల్లా స్థాయి నోడల్ అధికారి ఫోన్‌నెంబర్ ద్వారా 9440796701 నకు గాని లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 944090005ను సంప్ర దించి, పిర్యాదు చేయవలసిందిగా జిల్లా ఎస్పీ తెలిపారు.

## వైభవంగా శ్రీ పద్మావతి అమ్మవారి

# వసంతోత్సవాలు ప్రారంభం

## - నేడు స్వర్ణరథోత్సవం

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మే 23న ఉదయం ఉదయం 7.45 గంటలకు స్వర్ణ

మిగతా 2లో






# వసంతోత్సవాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి...)

రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. వసంత ఋతువులో మేషరాశిలో సూర్యుడు ఎక్కువ ప్రకాశవంతంగా ఉంటాడు. సూర్యకిరణాల వేడి వల్ల జీవులకు వ్యాధి బాధలు కలుగుతాయి. లోకమాత అయిన శ్రీ పద్మావతి అమ్మవారిని వసంతోత్సవాల ద్వారా ఆరాధించడం వల్ల శారీరక, మానసిక తాపాలు తొలగుతాయి.

**వైభవంగా స్నపన తిరుమంజనం...**

వసంతోత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి ఉత్సవర్లను ఆలయం నుండి శుక్రవారపు తోటకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. 2.30 గంటల నుండి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించనున్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జిల్లాలో పలువురు పోలీసు అధికారులు బాధ్యతలు





**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** జిల్లా పరిధిలో పలువురు పోలీస్ అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా వెంకటాద్రి, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిఐగా విశ్వనాధ్ చౌదరి బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో వేరువేరుగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ రాజును ఆయన చాంబర్ లో వేరువేరుగా పుష్పగుచ్చాలను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.

# జనార్ధనకు పీహెచ్‌డీ ప్రదానం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం భూగోళ శాస్త్ర పరిశోధక విద్యార్థి టి.జనార్దన్‌కు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల విభాగపు



నియంత్రణాధికారి ఎం.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా మునిసిపల్ పట్టణాల మురికివాడ లపై అధ్యయనం-సామాజిక, ఆర్థిక సర్వే ఆంధ్రప్రదేశ్. అనే అంశంపై డాక్టర్ వై.సుజాత పర్యవేక్షణలో జనార్ధన్ తన సిద్ధాంత వ్యాసాన్ని సమ ర్పించారు. ఇది వరలో ఆయన తిరుపతి కార్పోరేషన్‌లో మురికివాడలపై ప్రపంచీకరణ ప్రభావం, మురికివాడల ప్రజలకు ఆర్థిక వెసులుబాటు లేకపోవడానికి గల కారణాలపై అధ్యయనం అనే అంశాలపై,, రెండు జర్నల్స్ లో వ్యాసాలు ప్రచురించారు. ఇండి యన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్. వి. యూనివర్సిటీ సైన్స్ కమ్యూనికేషన్ పై నిర్వహించిన సెమినార్ లో పాల్గొన్నారు. ఇటీవల బెంగళూరు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యూజిట్ సమ్మేళనంలో, డైనమిక్స్ ఇన్ అర్బన్ స్లమ్స్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పై అధ్యయనం అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఇందుకు టి.జనార్ధన్ కు డాక్టరేట్ డిగ్రీ అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జనార్ధన్ కు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, హరినాథ్ రెడ్డి, రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ప్రసాద్, నరేంద్ర, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, పలువురు ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు అభినందనలు తెలియజేశారు.

# ఘనంగా ముగిసిన గంగ జాతర

(మొదటిపేజీ తరువాయి...)

14వ తేదీన అర్ధరాత్రి చాటింపుతో ఆరంభమైన తిరుపతి గంగజాతర భక్తకోటి మొక్కులతో ప్రతి రోజూ శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంభక్తుల పూజలతో కిక్కిరిసింది. తిరుమల శ్రీవెంకన్న చెల్లెలుగా అత్యంత ప్రాచీన చరిత్ర కలిగి భక్తకోటి పూజలందుకుంటున్న గంగమ్మతల్లి ఆలయ ప్రాశస్త్యిని, గంగజాతర వైభవాన్ని చాటుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అందించిన పిలుపుతో వారం రోజుల పాటు తిరుపతి గంగజాతర అంగరంగవైభవంగా సాగింది. భక్తులు పూజలు, సాంప్రదాయ సారెలతో గంగమ్మ ఆలయం- పులకించింది. ఆలయం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల సహకారంతో భక్తులకు పటిష్ట ఏర్పాట్లు చేశారు. రోజూ వేలాది మంది భక్తులు గంగజాతర వేషాలతో అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర చివరోజు మంగళవారం అర్ధరాత్రి తర్వాత కొలువు, తీరిన గంగమ్మ విశ్వరూపాన్ని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఆలయ ఆవరణలో పోలీసుల సమక్షంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలు అర్ధరాత్రి నుంచే భక్తులు విశ్వరూప దర్శనం? కోసం ఉవ్విళ్లూరు ఎదురు చూశారు. అర్ధరాత్రి తర్వాత సంపూర్ణంగా అమ్మవారి విశ్వరూపం కొలువై హారతులు అందుకొని భక్తలకు దర్శన భాగ్యం కల్పించారు. జాతర చివరి రోజు రాత్రి పేరంటాల వేషధారుడు కైకాల కులస్థుడు నగర పురవీధులు విహరిస్తూ భక్తుల పూజలందుకున్నారు. బుధవారం వేకువ జామున శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని చేరుకొన్న పేరంటాలు గంగమ్మతల్లి విశ్వరూప ప్రతిమ చెంపనరకడంతో జాతర సమాప్తమైంది. అమ్మవారి విశ్వరూప ఘట్టాన్ని చూసేందుకు భక్తులు ఎగబడ్డారు. దీంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. అమ్మా... గంగమ్మా... చల్లంగా చూసి కాపాడవమ్మా అంటూ భక్తులు చేతులు జోడించి అమ్మవారిని వేడుకున్నారు. అత్యంత పవిత్రంగా భావించే గంగమ్మ విశ్వరూప ప్రతి బంకమట్టి కోసం భక్తులు ఎగబడ్డారు. అనంతరం పేరంటాలు శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయానిక చేరుకొని అక్కడ కొలువైన పెద్ద గంగమ్మ విశ్వరూప ప్రతిమ చెంపనరకడంతో జాతర ఘట్టం ముగిసింది.



# మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

(మొదటిపేజీ తరువాయి...)

మహిళా విశ్వవిద్యాలయంలో ఒక పార్లమెంటు, అసెంబ్లీ కి సంబంధించిన ఏడు నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులు కేటాయించబడిన సంబంధిత అధికారులు అందరు ఈవీఎం, వీ వీ ప్యాట్ లు, ఓట్ల లెక్కింపుల గురించి హ్యాండ్ బుక్ ని క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకుని కౌంటింగ్ నిర్వహణలో ప్రముఖ పాత్ర వహించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో కౌంటింగ్ సూపర్వైజర్ లు వారి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు . కౌంటింగ్ కేంద్రాలలో టేబుల్స్ ఏర్పాట్లును, భద్రతను పటిష్టంగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కౌంటింగ్ విధులు కేటాయించిన సిబ్బంది యొక్క మొబైల్ ఫోన్లు కౌంటింగ్ సెంటర్లోకి అనుమతి లేదని తెలిపారు. కౌంటింగ్ విధులు కేటాయించబడిన సిబ్బంది ఉదయం 7.00 గంటలకు అందరూ కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఎలాంటి అలసత్వం వహించరాదని అన్నారు. ఓటర్ల లెక్కింపు ఉదయం 8.00 గంటలకు ప్రారంభమవుతుందని ఆర్వోలు అందరూ కౌంటింగ్ ముందుగానే నియోజకవర్గాల వారిగా ఈవీఎంలను సరి చూసుకోవాలని తెలిపారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై కూడా సంబంధిత అధికారులు జాగ్రత్త వహించి కౌంటింగ్ నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ సమయంలో వీడియో కవరేజ్ చేపట్టడం, కౌంటింగ్ రోజు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలన ఉంటుందన్నారు. కౌంటింగ్ లో పాల్గొనే ప్రతి ఒక్క సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల పార్టీ ఏజెంట్లు కూడా కచ్చితంగా గుర్తింపు కార్డులు ధరించాలని తెలిపారు. కౌంటింగ్ విధులు కేటాయించిన సిబ్బందికి త్రాగునీరు, భోజన సౌకర్యం కల్పించాలని తెలిపారు. కౌంటింగ్ అనంతరం ఈ వీ ఎం, వీ వీ ప్యాట్ లు, పటిష్టమైన బందోబస్తు ద్వారా స్ట్రాంగ్ రూమ్ లోకి చేర్చేలా ఆయా నియోజకవర్గాల ఆర్వోలు సిద్ధంగా ఉండాలన్నారు. కావున ప్రతి ఒక్కరు కౌంటింగ్ విధానం సజావుగా జరిగేలా తమ వంతు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సుమారు 950 మంది హాజరు కావడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధ్యాన చంద్ర, తిరుపతి మునిసిపల్ కమిషనర్ అదితిసింగ్, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు, రిటర్నింగ్ అధికారులు నిశాంత్ రెడ్డి రవిశంకర్ రెడ్డి, చంద్రముని, కిరణ్ కుమార్ రెడ్డి, నియోజకవర్గాల ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య అధికారిణి

శాంతిపురం మేజర్‌న్యూస్: శాంతిపురంలోని ప్రాథమిక ఆరోగ్య



కేంద్రాన్ని జిల్లా వైద్య అధికారిణి డాక్టర్ ప్రభావతి దేవి బుధవారం ఆకస్మికంగా విచ్చేసి తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను మరియు ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి ఆరా తీశారు. గురువారం నిర్వహించిన అడల్ట్ బి సి జి వ్యాక్సినేషన్ మరియు ఆర్ సి హెచ్ పోర్టల్ నమోదు గురించి తగు సూచనలను సలహాలు సిబ్బందికి తెలియచేశారు. ఆరోగ్యపరమైన ప్రజలకు సేవలను అందించడంలో అలసట వహించరాదని, ప్రతి ఒక్కరు వారి యొక్క విధులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ వంశీ కృష్ణ డాక్టర్ ప్రసాద్ సిహెచ్ఓ లతీఫ్ ఖాన్ సూపర్ సూపర్వైజర్లు శశికళ కోదండపాణి స్టాక్ నర్సులు కళ్యాణి రాధా పుష్ప ఏ ఏఎన్ఎంలు ఎమ్మెల్యే హెచ్వీలు పాల్గొన్నారు

## రూయాలో నేత్ర దానం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** రుయా ఆస్పత్రిలో తిరుపతి కొర్లగుంటకు చెందిన కె మరియదాస్ గుండె పోటుతో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మనవరాలు కే సంధ్య తన తాత నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో బుధవారం రుయా కంటి విభాగం విభాగాధిపతి డాక్టర్.చలపతి రెడ్డి అధ్వర్యంలో నేత్రాలను సేకరించి నేత్ర విభాగ, నేత్ర నిధి బ్యాంకులో డిపాజిట్ చేశారు. చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులు సమ్మతితోనే నేత్రాలను సేకరించి నేత్ర బ్యాంకులో భద్రపరచినట్లు నేత్ర విభాగాధిపతి డాక్టర్ చలపతి రెడ్డి తెలిపారు. రుయా ఆసుపత్రి అదనపు వైద్య విద్య సంచాలకులు, సూపరిటెండెంట్ డాక్టర్ జి రవి ప్రభు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు అవయవ దానం చేయడం వలన ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ఈ అవయవాలను ఉచితంగా అమర్చి ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అవయవ దానం చేసేందుకు ఈ క్రింది 8500880126 నెంబర్ ను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్వి ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ఎస్.రమేష్, ఎస్వి వైద్య కళాశాల పిఆర్ఓ. వీర కిరణ్ పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక తరలింపును అరికట్టరా?



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** పాలసముద్రం మండలంలో అక్రమంగా ఇసుకు తరలిస్తున్నారు. వాటి నివారించాలని జనసేన నియోజకవర్గ బాధ్యులు పొన్న యుగంధర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలసముద్రం, వెంగళరాజు కుప్పం, వనదుర్గాపురం, నరసింహపురం అటవీ ప్రాంతాలకు సమీపంలోని, చెరువులు కాలువల్లో, వచ్చే ఇసుకను ఒక ట్రక్కు 3,500 చొప్పున తమిళనాడుకి అధికార పార్టీ నాయకులు తరలిస్తున్నారని వార్తాపత్రికల్లో వస్తున్న నేపథ్యంలో పోలీసులు, అటు, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి క్రిమినల్ చర్యలు చేపట్టాలని, వారిని జైలుకు పంపాలని, యుద్ధ ప్రాతిపదికను ఇన్వెస్టిగేషన్ చేయాలని, భూగర్భ జలాలు మట్టం తగ్గిపోకుండా చూడాలని, జనసేన పార్టీ తరపున డిమాండ్ చేసుకున్నామన్నారు.

## వైభవంగా అర్జునుని తపస్సు కార్యక్రమం



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలోని కత్తెరపల్లి పంచాయతీలో ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అర్జునుని తపస్సు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పగలు హరికథ పాండవుల వనవాసం ఉభయ దారులు శెట్టిగుంట ఎస్టి కాలనీ వారు నిర్వహించారు. రాత్రి నాటకము గయోపాఖ్యానం ఉభయ దారులు.గోపిశెట్టిపల్లి గ్రామం చెందిన డాక్టర్ పయణి మొదలియార్ వారిచే హరికథ, నాటకాన్ని వేయించారు. మధ్యాహ్నం మాజీ సైనికుడు ఎల్లప్ప జ్ఞాపకార్థం వారి కు టుంబ సభ్యులు నరసమ్మ అన్నదానం నిర్వహించారు. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉభయ దాతలు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్వీ జూలో ఘనంగా ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం



**తిరుపతి అర్బన్, మేజర్ న్యూస్:** బుధవారం ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం(ఇంటర్నేషనల్ బయోడైవర్సిటీ డే)ను పురస్కరించుకుని స్థానిక శ్రీ వెంకటేశ్వర జూపార్క్ నందు గుంటూరులోని "ఆంధ్ర ప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్" ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగం గా తిరుపతి విశ్వం హై స్కూల్, విద్యార్థులకు పక్షుల నడక చిత్ర లేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభను కనబ రిచారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు సర్టిఫికెట్లు అదేవిధంగా పోటీలో పాల్గొన్న ఇతర విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో యశోద భాయ్ (బయో ట్రిమ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) ఎస్వి జూ క్యూరేటర్ సి.సెల్వం, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ జి. సతీష్, శివకుమార్( డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ రెడ్ శాండర్స్), ధర్మరాజులు (డిఎఫ్ఓ సోషల్ ఫారెస్ట్రీ),సి.హెచ్. నాగభూషణం(ఏసిఎఫ్), ఖాదర్ వల్లి(స్టేట్ కో ఆర్డినేటర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డ్) లతోపాటు జూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీఆర్ సెట్ ఫలితాలు విడుదల

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఏపీఆర్ సెట్ 2023-24 ఫలితాలను బుధవారం ఎస్వియు ఉపకులపతి ఆచార్య వి శ్రీకాంత్ రెడ్డి ఆయన ఛాంబర్ లో విడుదల చేశారు. ఈనెల రెండో తేదీ నుంచి ఐదో తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏపీ ఆర్ సెట్ పరీక్షలు నిర్వహించింది. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఏపీఆర్ సెట్‌ను మొత్తం 64 సబ్జెక్టులలో నిర్వహించామని, ఇందులో మొత్తం 10050 మంది దరఖాస్తు చేసుకోగా, 8651 మంది హాజరయ్యారని, వారిలో 4352 మంది ఉత్తీర్ణత సాధించారని, వారిలో పురుషులు 2226, స్త్రీలు 2126 వున్నారని తెలిపారు. యస్వీయూకు రీ సెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించిన ఉన్నతవిద్య మండలికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విజయవంతంగా సెట్ నిర్వహణ చేసిన కన్వీనర్ ఆచార్య దేవప్రసాద్ రాజు ను అభినందించారు. ఏపీఆర్ సెట్ కన్వీనర్ ఆచార్య దేవప్రసాద రాజు మాట్లాడుతూ వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా వున్న 2728 పిహెచ్‌డి సీట్లకుగాను ఏపీఆర్ సెట్ నిర్వహించామన్నారు. ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు జూన్ 10 తర్వాత ఇంటర్వ్యూలు నిర్వహించి ర్యాంకులు ప్రకటిస్తామని తెలిపారు. ఫలితాలను వెబ్‌సైట్లో చూడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కిశోర్ ,ఆచార్య కుమారస్వామి, ఆచార్య కుసుమహరినాథ్, కామేష్, నాగభూషణం, సుకుమార్ డా. సునీల్ కుమార్ పాల్గొన్నారు.



ఏపీఆర్ సెట్ ఫలితాలను విడుదల చేస్తున్న విసి శ్రీకాంత్ రెడ్డి అధికారులు

# ముగిసిన తరిగొండ వెంగమాంబ జయంతి ఉత్సవాలు

**- సహజ కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ**

**- శతావధాని ఆముదాల మురళి**



**తిరుపతి రెవెన్యూ మేజర్‌న్యూస్ :** మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సామాన్యులు సైతం అర్థం చేసుకునే ప్రజాకవిత్వం ద్వారా శ్రీవేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని వ్యాప్తి చేశారని తిరుపతికి చెందిన శతావధాని ఆముదాల మురళి పేర్కొన్నారు. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 294వ జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు తరిగొండ వెంగమాంబ సాహిత్యంపై సదస్సు జరిగింది. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆముదాల మురళి ఉపన్యసిస్తూ, వెంగమాంబ రచనలు నాటి సమాజంలోని రుగ్మతలను ప్రశ్నిస్తూ, నేటి సమాజానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. వెంగమాంబ తన జీవితాన్ని స్వామివారి కైంకర్యానికి అంకితం చేశారని తెలిపారు. ఈమె వ్యక్తిగా, సంస్కర్తగా, యోగినిగా, కవయిత్రిగా శ్రీవారి భక్తితత్వాన్ని ప్రచారం చేశారని వివరించారు. డా.వి.ఆర్. రాసాని " మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవిత విశేషాలు " అనే అంశంపై మాట్లాడుతూ, వెంగమాంబ బాల్యంలోనే భర్తను పోగొట్టుకున్నా, వైధవ్యాన్ని అంగీకరించలేదని దీనికి కారణం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని తన భర్తగా భావించిందని తెలిపారు. అన్నమయ్య కీర్తనల ద్వారా స్వామివారిని ఆరాధించగా, వెంగమాంగ గద్యం, పద్యం, యక్షగానాల రచన ద్వారా భక్తిని చాటుకున్నారని చెప్పారు. వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయ పీఠం సహాయ పరిశోధకులు డాక్టర్ కేశవులు " మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ - సాహిత్యం, వర్ణనలు " అనే అంశంపై మాట్లాడుతూ, ఆమె వివిధ సాహిత్య ప్రక్రియలలో 18 గ్రంథాలను రచించిన మొదటి తెలుగు కవయిత్రి అని తెలిపారు. రచనలలో సకల సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని తాత్వికతను లోకానికి అందించినట్లు చెప్పారు. ప్రాచీన కవులకు దీటుగా, ప్రబంధాలకు పోటీగా తరిగొండ వెంగమాంబ అష్టాదశ వర్ణనలు చేశారని సోదాహరణంగా వివరించారు. తిరుపతికి చెందిన డా. బాలాజీ దీక్షితులు " మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ - తెలుగు సాహిత్య సౌరభం " అనే అంశంపై ఉపన్యసిస్తూ, తరిగొండ వెంగమాంబ కవిత మాధుర్యం వర్ణన అలవి కాదన్నారు. ఆమె ఆంజనేయ స్వామి గురించి తపస్సు చేసిన అటవీ మార్గం నేటికీ యోగ సాధన రహస్యాలు తెలిపే మార్గమని వివరించారు.సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్ట్, ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థులచే భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించునున్నారు.

## ఔషధ విభాగానికి ఎయిర్ కండిషనర్ వితరణ



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఎస్వి వైద్య కళాశాల ఔషధ విభాగానికి పరిశోధనలకు, ఔషధాల, పరికరాలు భద్రపరిచేందుకు, ఉపయోగకంగా ఔషధ విభాగాధిపతి డాక్టర్ ఆశాలత, ప్రొఫెసర్ డాక్టర్ భారతి బిజీ విద్యార్థుల సౌకర్యార్థం బుధవారం లక్ష 20 వేలు ఎయిర్ కండిషనర్ ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్న కారణంగా ఔషధ విభాగంలోని ఔషధాలు పాడవకుండా ఉండేందుకు ఎయిర్ కండిషనర్ల వితరణ ఉండేందుకు 2 ఎయిర్ కండిషనర్ ను ఔషధ విభాగం సిబ్బందికి అందజేశామని తెలిపారు. దీంతో ఔషధ విభాగానికి చెందిన పరిశోధనలు చక్కటి వాతావరణంలో పరిశోధన చేసుకొనుటకు ఎంతో ఉపయోగ ఉంటుందన్నారు. ఎయిర్ కండిషనర్ల వితరణగా అందించిన వైద్య అధిపతులకు ఎస్ వి వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర కుమార్, అసోసియేటెడ్ ప్రొఫెసర్, డాక్టర్ మీనాక్షి అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ అమృత కిరణ్ కుమార్ అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ రామమూర్తి అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ రాధా అసిస్టెంట్ ప్రొఫెసర్, ఔషధ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రాధాకృష్ణారెడ్డి వర్ధంతి

**వాకాడు, మేజర్ న్యూస్:** వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి తండ్రి కొడవలూరు రాధాకృష్ణారెడ్డి మూడవ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.రాధా కృష్ణా రెడ్డి మూడువ వర్ధంతి సందర్భంగా స్వగ్రామమైన బాలిరెడ్డిపాలెంలో ఆయన కుమారుడు వైసీపీ సీనియర్ నేత కొడవలూరు దామోదర్ రెడ్డి రెడ్డి రాధాకృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించి మూడవ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి బంధుమిత్రులు, వైసీపీ నాయకులు హాజరయ్యారు.



# మారి ముత్యమ్మా... చల్లగా చూడమ్మా..

**మారి ముత్యమ్మ జాతర వేడుకలు**



**పెనుమూరు, మేజర్‌న్యూస్:** అమ్మ ముత్యమ్మా.... సకల జనులను చల్లగా చూసి ఆశీర్వదించమ్మా... నీ ఆశీర్వాదాలతో రైతులు పండించే పంటలు పండి, పశుపక్షాదులు, తన బిడ్డల్లాంటి ప్రజలను సుఖ సంతోషాలతో జీవించే విధంగా నీ చల్లని చూపుతో ఆశీర్వదించు అమ్మా.. పెనుమూరు మండలంలోని ఉగ్రాణం పల్లె గ్రామ దేవత అయిన మారి ముత్యమ్మ జాతర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉగ్రాణం పల్లె గ్రామ దేవత అయిన మారి ముత్యమ్మకు సుప్రభాత సేవ నుండి అమ్మవారికి ప్రత్యేక అర్చనలు అభిషేకాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గుణశేఖర్ రెడ్డి భక్తులు అమ్మవారి దర్శనం ఏర్పాటుపై ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఉగ్రహణం పల్లె సర్పంచ్ ఐరాల మురళి కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అమ్మవారికి సారెను సాంప్రదాయ బద్ధంగా అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అలాగే మరి కొంత మంది భక్తులు అమ్మవారి పేరిట కోళ్లు, మేకను బలి దానం చేపట్టారు. అలాగే మరి కొంతమంది మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లను వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. దీంతో అమ్మవారు జాతర వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూల అలంకరణతో భక్తులకు దర్శనార్థం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉగ్రాణంపల్లి సర్పంచ్ ఐరాల మురళి కుమార్ రెడ్డి, ఆలయ ధర్మకర్త గుణశేఖర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, రమణారెడ్డి, కోటీ రెడ్డి, రాజేష్ రెడ్డి, రవి రెడ్డి జగపతి రెడ్డి, ఆలయార్చకులు శేఖర్ రెడ్డి, పరంధాం రెడ్డి, ప్రతాప్ రెడ్డి, అమ్మవారి భక్తులు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.



# శాస్త్రోక్తంగా నృసింహ పూజ

**తిరుమల, మేజర్‌న్యూస్:** వైశాఖమాస ఉత్సవాల్లో భాగంగా నృసింహ జయంతిని పురస్కరించుకుని తిరుమల వసంత మండపంలో బుధవారం నృసింహ పూజ శాస్త్రోక్తంగా జరిగింది. ఇందుకోసం శ్రీవారిని నృసింహ స్వామి అలంకారంలో సింహ వాహనంపై కొలువుదీర్చారు. సుదర్శన చక్రం, నరసింహుని ప్రతిమను ఏర్పాటుచేశారు. అభిముఖంగా నరసింహస్వామివారి ప్రతిమలను ఆశీనులను చేశారు. పూజలో భాగంగా నృసింహ మంత్రాన్ని 108 సార్లు, నృసింహ అష్టోత్తర శత నామావళి, సుదర్శన మంత్రాన్ని 24సార్లు పారాయణం చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ అర్చకులు, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం పండితులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి స్ట్రాంగ్ రూంల పరిశీలన

**ఈవీఎంల భద్రతపై అధికారులతో చర్చించిన దగ్గుమళ్ళ ప్రసాదరావు**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** ఎన్డీఏ కూటమి చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు బుధవారం చిత్తూరు సమీపంలోని ఎస్.వి.సి.ఈ.టి విద్యాసంస్థలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత, పోలీసుల విధి నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఆరాదీసారు.. అంతేకాక స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి, భద్రపరిచిన ఈవీఎంల దృశ్యాలను సిసి ఫుటేజ్‌ల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించారు.

పోలీస్ అధికారులు తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించి, ఈవీఎంలకు ప్రత్యేకమైన భద్రత కల్పించాలని దగ్గుమళ్ళ ప్రసాదరావు పోలీస్ అధికారులకు సూచించారు. చిత్తూరు టిడిపి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు వెంట చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సి.ఆర్ రాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజు, టిడిపి నాయకులు సునీల్ కుమార్ చౌదరి ఉన్నారు.



# ప్రశాంతంగా తిరుపతి గంగ జాతర

**- హర్షం వ్యక్తం చేసిన ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** వెంకన్న చెల్లిగా భక్తుల కోరిన కోరికలు తీర్చే తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ అత్యంత వైభవంగా ప్రశాంతత వాతావరణంలో ముగియడం అభినందనీయమని, ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. వారం రోజులు పాటు జరిగిన జాతరలో గంగమ్మకు వివిధ వేషధారణతో వేలాదిమంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. బుధవారం తెల్లవారుజామున చెంప నరకడంతో ముగిసిన జాతర వేడుకల్లో భక్తిశ్రద్ధలతో భక్తులు వేచి ఉండి దర్శనం చేసుకోవడం గంగమ్మపై భక్తులకు ఉన్న నమ్మకాన్ని తెలుపుతుందన్నారు. తిరుపతి ప్రజలందరిపై గంగమ్మ ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. జాతర ప్రశాంతంగా ముగియడంలో గంగమ్మ ఆలయ అధికారులు, సిబ్బందికి, పోలీసులు, మున్సిపల్ కార్పోరేషన్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



# వైభవంగా పులిగుంటేశ్వరుని గిరి ప్రదక్షిణ

**పెనుమూరు, మేజర్‌న్యూస్:** స్వయంభు పులిగుంటేశ్వర స్వామి దేవస్థానంలో వైశాఖ మాస పౌర్ణమి పూజలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ నుండి పార్వతి దేవి సమేత పులిగుంటిఈశ్వర స్వామికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలను కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులైన పార్వతీదేవి సమేత పులుగుంటేశ్వర స్వామికి అత్యంత వైభవంగా పాలాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులైన పార్వతి దేవి సమేత పులిగుంటేశ్వర స్వామిని శేష వాహనంపై గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో 166వ గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని స్థానిక పులిగుంటి స్వర దేవస్థానం నుండి గుంటుపల్లి రోడ్డు, కన్నికా కాపురం రోడ్డు, కొత్త రోడ్డు, తానా మిట్ట, దొడ్ల డైరీ, సీఎస్ అగ్రహారం కాలనీ మీదుగా స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా కన్యకాపురం గ్రామస్తులు రాజగోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం, ఈశ్వరమ్మ, మహేష్ రెడ్డి ముని స్రవంతి, ముఖేష్ రెడ్డి, ధార్మిక రెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి కార్యనిర్వహకులుగా, షణ్ముఖ రెడ్డి, సుబ్రహ్మణ్యం, స్వామి వారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

**తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా నూతన పోలీసు సూపరింటెండెంట్ వి.హర్షవర్ధన్ రాజు బుధవారం శ్రీకాళహస్తి డిఎస్పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తనకు అప్పగించిన బాధ్యతను సవాల్‌గా భావిస్తున్నట్లు తెలిపారు, ప్రజాస్వామ్యంలో ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఇప్పటికే ప్రజలు ఇచ్చిన తీర్పు నిక్షిప్తం చేయబడినది, లెక్కింపు మాత్రమే మిగిలింది, ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు జరగకుండా జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా జరిపించడమే ప్రస్తుతం తమ ముందున్న ప్రధాన కర్తవ్యం. దానికి సంబంధించి పోలీస్ శాఖ ప్రణాళికనురూపొందించి తగిన బందోబస్తు ఏర్పాటు చేసుకొని సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. కావున ప్రజలు, రాజకీయప్రతినిధులు చట్టానికి వ్యతిరేకంగా పనిచేయడం వంటి విమానేయాల్సిన అవసరం చాలా ఉందని. కాబట్టి మనమందరం కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు పిలుపు నిచ్చారు. పాత్రికేయ మిత్రుల యొక్క సహాయ సహకారాలు ఎంతైనా అవసరముంది. మీరు కూడా మీ బాధ్యతలను గుర్తించుకుని శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు నిత్యం సహకరిస్తారని ఆశిస్తున్నానన్నారు.

పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించే విధంగా పని చేస్తారని అలా పని చేసే విధంగా తాను ముందుండి నడిపిస్తానన్నారు. తిరుపతిలో పద్మావతి కాలేజ్ వద్ద, జరిగిన సంఘటనపై ఇప్పటికే అనేక మందిని విచారిస్తున్నామని, కొంతమందిని బైండోవర్ చేసుకొని రిమాండ్‌కు తరలించి ఉన్నామని, తిరుపతి చంద్రగిరిలో మరి కొంతమందిపై గాలింపు చర్యలు చేపట్టామని త్వరలో వారిని కూడా పట్టుకొని విచారణ చేస్తామన్నారు.



# ఓట్ల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు

**తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు**

**జూన్ 4వ తేదీన విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు ఎలాంటి అనుమతి లేదు**

**చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు**

**రాజకీయ పార్టీల ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా నూతన ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి శ్రీకాళహస్తి సబ్ డివిజన్‌లో డీఎస్పీ కార్యాలయం, శ్రీకాళహస్తి వన్ టౌన్, శ్రీకాళహస్తి టూ టౌన్, శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీలు చేసి, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీసులను అప్రమత్తం చేశారు. అనంతరం శ్రీకాళహస్తి డిఎస్పీ కార్యాలయంలో పత్రికా సమావేశం ఏర్పాటు చేసినారు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఐపీఎస్. మాట్లాడుతూ కౌంటింగ్ కొరకు కౌంటింగ్ కేంద్రమైన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నందు మూడంచెల భద్రత వ్యవస్థతో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఓట్లలెక్కింపు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు ఇప్పటికే తీసుకోవడం జరిగింది. చట్టాన్ని



ఎవరైనా అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కావున ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు సంయమనం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు. అలాగే మీడియా వారు కూడా తమ వంతు బాధ్యతలను నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. కౌంటింగ్ రోజున జిల్లా వ్యాప్తంగా విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించుటకు ఎవరికీ ఎటువంటి అనుమతి లేదు. ఆరోజు జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 144 సీఆర్పీసీ అమలులో ఉంటుంది. ఆ తర్వాత రోజులలో ముందస్తుగా పోలీస్‌శాఖ నుండి అనుమతి పొందిన వారు మాత్రమే విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలన్నారు.

అనంతరం ఆకస్మిక తనిఖీలలో భాగంగా శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతూ కౌంటింగ్ సమీపిస్తున్న సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ట్రబుల్ మాంగర్లు, పాత నేరస్తులు, అనుమానితులు వంటి వారిని ముందస్తుగా గృహనిర్బంధం చేయుటకు చర్యలు తీసుకోవాలి. ముందస్తు సమాచార వ్యవస్థను పటిష్టపరుచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డిఎస్పి ఉమామహేశ్వర్ రెడ్డి, సీఐలు నరసింహారావు శ్రీకాళహస్తి వన్ టౌన్, రారాజు శ్రీకాళహస్తి టు టౌన్, అజయ్ కుమార్ శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు ఎస్సై రాఘవేంద్ర, పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

# లక్ష్మీ నరసింహ స్వామి జయంతి

**- స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు**

**దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంకు అనుబంధ దేవాలయం భక్త కన్నప్ప కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఈ ఉత్సవంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు పాల్గొన్నారు. ముందుగా కలశం స్థాపన చేసి ప్రత్యేక సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామికి పాలు, పెరుగు, పంచామృతం, గంధం, పసుపు, కుంకుమల. సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు కరుణ స్వామి గురుకుల్, ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి, వేద పండితులు అర్ధగిరి, దేవస్థాన అధికారులు ఏ ఈ వేణుగోపాల్ రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ సూర్య ప్రతాప్, దేవస్థాన సిబ్బంది చైర్మన్ సిసి సుదర్శన్ రెడ్డి దేవస్థానం పరిచారకులు గోవింద్ శర్మ, చందు శర్మ, రాకేష్ శర్మ, పట్టణ ప్రముఖులు స్వర్ణ మూర్తి, దేవస్థాన సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన

# కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:**

పోల్డ్ ఈవిఎంలు భద్రపరచిన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూం భద్రత ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బుధవారం రాత్రి సదరు స్ట్రాంగ్ రూంను కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడుతూ స్ట్రాంగ్ రూం భద్రత ఏర్పాట్లు 24/7 అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీసీటీవీ కెమెరాల కంట్రోల్ రూం నందు ఈవిఎంలను పరిశీలించారు. సందర్శకుల రిజిష్టర్ నందు సంతకాలు చేశారు. కలెక్టర్ వెంట అదనపు ఎస్పీ రిజర్వ్ శ్రీనివాస రావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులు ఉన్నారు.



# వైభవంగా ముగిసిన గంగమ్మ నిమజ్జనం

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నగరంలో గ్రామ జాతర వేడుకల నిమర్జనం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. అశేష జన సందోహం మధ్య అమ్మవరి నిమజ్జన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది.ఓం శక్తి భక్తుల విన్యాసాలు ప్రదర్శనలు కళాకారుల ముత్యల నడుమవం వైభోపేతంగా నడివీధి గంగజాతర వేడుకలు ముగిసింది. వంశ శపారంపర్య ధర్మకర్త మాజీ ఎమ్మెల్యే సీకే బాబు దంపతులు అమ్మవారికి సారె సమర్పించడంతో నిమజ్జనానికి అమ్మవారిని కదిలించారు. మంగళవారం అమ్మవారికి అంబలిని, కుంభాన్ని నైవేద్యంగా భక్తులు సమర్పించారు. తొలిరోజ అమ్మవారిని దర్శించుకోవడం కోసం వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చిత్తూరు నగరం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. చిత్తూరుకు చెందిన వారందరూ ఉద్యోగరీత్యా, వ్యాపార రీత్యా వివిధ దేశ, విదేశాల్లో స్థిరపడిన వారందరూ ఈసారి సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు నగరానికి వచ్చిన వారందరూ జాతర వేడుకలను తిలకించారు. రెండవ రోజైన బుధవారం కూడా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. చిత్తూరు నగరంతో పాటు చుట్టుపక్కల మండలాలైన ఐరాల, తవణంపల్లి , పూతలపట్టు, యాదమరి, పెనుమూరు, బంగారుపాళ్యం, శ్రీరంగరాజపురం, పాలసముద్రం తదితర మండలాల నుంచి సైతం ప్రజలు చిత్తూరుకు వచ్చి నడివీధి గంగమ్మను దర్శించుకున్నారు. సాయంత్రం వంశపారంపర్య ధర్మకర్త సికే బాబు దంపతులు స్థానిక పొన్నియమ్మ గుడి వీధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి సారెను తలపై పెట్టుకుని ఊరేగింపుగా పొన్నియమ్మ గుడి వీధి, పాత బస్టాండ్ జంక్షన్, చర్చి వీధి, ఓటికె రోడ్, డిఐ రోడ్డు జంక్షన్ మీదుగా బజారు వీధి చేరుకుని గంగమ్మ తల్లికి సీకే బాబు దంపతులు సారెను సమర్పించారు. అనంతరం అమ్మవారిని కదిలిస్తూ నిమజ్జనానికి తరలించారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య అమ్మవారు ఊరేగింపుగా భక్తులకు దర్శనమిస్తూ నిమజ్జనానికి బయలుదేరారు. మార్గమధ్యలో భక్తులు అమ్మవారికి టెంకాయలు కొడుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని చూడడం కోసం బజారు వీధికి ఇరువైపులా జనంతో నిండిపోయింది. ఎక్కడ చూసినా ఇసుకేస్తే రాల్లంతా జనం కనిపించారు. పిల్లలు, యువకులు, యువత, మహిళలు, ప్రజలు, భక్తులు, ఓంశక్తి భక్తులతో అమ్మవారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. వివిధ రాష్ట్రాలతోపాటు దేశ విదేశాల నుంచి ఈసారి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో అమ్మవారిని ఊరేగించే ప్రాంతమంతా జనంతో కిక్కిరిసిపోయింది. నిమజ్జనంలో భాగంగా హై రోడ్డులో మ్యాక్స్ జంక్షన్ వద్ద ఓం శక్తి భక్తులు లారీలో కొక్కికి వేలాడుతూ అమ్మవారికి మాల సమర్పించడంతో అమ్మవారిని కట్టమంచి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వంశపరంపర్య ధర్మకర్త సికే బాబు నడివీధి గంగ జాతర ఉత్సవ వేడుకల్లో విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు , నగరపాలక అధికారులు , ఇతర సిబ్బందిని అభినందిస్తూ గంగమ్మ ప్రసాదాలను అందజేశారు.

**ఆకట్టుకున్న ఓం శక్తి భక్తుల విన్యాసాలు...** చిత్తూరు నగరంలో ఓం శక్తి భక్తులు ప్రదర్శించిన విన్యాసాలు అందర్నీ ఆకట్టుకుంది. బుధవారం చిత్తూరు నగరంలోని స్థానిక ఈశ్వరుని గుడిలో ఓం శక్తి భక్తులకు నోటికి సూలాలు గుచ్చడం , వీపుకి మోకాళ్ళకు ఇనుపకొక్కిలు గుచ్చడం వంటివి చిత్తూరు నగరంలో గత మూడు సంవత్సరాలుగా వస్తున్న ఆనవాయితీ. అనేకమంది భక్తులు తమ కోరికలు తీర్చడం కోసం ఓం శక్తి మాలలు ధరించి వారి శక్తి మేరకు నోటికి సూలాలు గుచ్చుకోవడం, వీపుకి కొక్కిలు గుచ్చుకుని వాహనాలను లాగడం వంటివి చేస్తూ అమ్మవారికి తమ మొక్కులను తీర్చుకుంటారు. ఈ క్రమంలో భాగంగా బుధవారం వందల సంఖ్యలో ఓం శక్తి భక్తులు పలు రకాల విన్యాసాలను ప్రదర్శించారు ఓం శక్తి భక్తులు నోటికి సూలాలను గుచ్చుకోవడం, వీపులకు , కాళ్లకు ఇనుప కొక్కిళ్ళు గుచ్చుకొని వాహనాలను లాగుతుండడం, ఒళ్ళు జగుర్పించేలా ఓం శక్తి భక్తుల విన్యాసాలు చూసి పలువురు భక్తులు ఆశ్చర్యపోయారు. ఓంశక్తి భక్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరిత శంకర్ ఆధ్వర్యంలో ఓం శక్తి భక్తుల విన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏట గంగమ్మ జాతర నిమజ్జనం రోజున ఓంశక్తి భక్తులు వివిధ రకాల విన్యాసాల ప్రదర్శిస్తూ అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఎంతో భక్తి విశ్వాసంతో ఓం శక్తి మాలను ధరించి అమ్మవారి కి తమ కోరికలు తీర్చడం కోసం నోటికి సూలాలు గుచ్చుకోవడం వీపుకి ఇనుప కొక్కిలు వేసుకుని వివిధ రకాల వాహనాలు లాగుతూ తమ మొక్కులను తీర్చుకుంటారని ఆమె చెప్పారు. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా చిత్తూరు నడివీధి గంగమ్మ అంటేనే భక్తులకు ఎంతో విశ్వాసం అని , ఇందులో భాగంగానే ఆడ మగ చిన్న పెద్ద తేడా లేకుండా వారి వారి కోరికలను తీర్చుకోవడం కోసం ఓం శక్తి భక్తులు పలు రకాల విన్యాసాలు ప్రదర్శిస్తారని ఆమె పేర్కొన్నారు. వీటితోపాటు కొంతమందివ ఓం శక్తి భక్తులు గరికలను తల మీద పెట్టుకోవడం, అమ్మవారి శిరస్సును తన మీద పెట్టుకుని తమ మొక్కులను తీర్చుకుంటారు. స్థానిక ఈశ్వరుని గుడి మీద నుంచి బయలుదేరిని ఓం శక్తి భక్తులు మార్కెట్ చౌక్, చర్చి వీధి, పొనియమ్మ గుడి వీధి, హై రోడ్ మీదుగా నడిమిది అమ్మవారిని దర్శించుకుని ఓంశక్తి భక్తులు తమ మొక్కలు తీర్చుకుంటారు. ముందస్తుగా పోలీసు అధికారులు తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అమాంఛనీయ సంఘటన జరగకుండా ఓం శక్తి భక్తుల విన్యాసాలు ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్ర మంలో ఆర్ముగ రెడ్డి, గిరిజ, నాగయ్య తదితర ఓం శక్తి భక్తులు పాల్గొన్నారు.



## వైభవంగా బీపీ అగ్రహారం గంగమ్మ జాతర

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం బీపీ అగ్రహారం గంగమ్మ జాతరను తిరుపతి గంగమ్మ జాతర రోజు నిర్వహించడం ఆనవాయితీ గా వస్తున్న ఆచారం. అందులో బాగాగంగా బుధవారం బీపీ అగ్రహారంలో గంగమ్మ జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు.



ముందుగా అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహానికి వివిధ రకాల పుష్పాలతో గజమాలతో సుందరంగా కొలువు తీర్చగా భక్తులు వెయ్యి కల్లు దుత్తులతో, కోళ్ళు, పొట్టేలు బలులు ఇచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## ప్రజా నాయకుడు బొజ్జల సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఉమ్మడిఅభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి 45వ జన్మదినం సందర్భంగా కొత్తపేట కార్గిల్ సెంటర్ దగ్గర మైనార్టీ నాయకుడు జావిద్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ అన్న దాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనా రిటీ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీర్ అలీ, రాష్ట్ర కార్యదర్శి దసరాదాచారి, పాల సొసైటీ మాజీ చైర్మన్ ముని రాజానాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్ర నాయుడు, మైనార్టీ అధ్యక్షుడు షఫీ, ఖలీల్ భాషా, ఖాదర్ బాషా, గిరి, చాంద్ బాషా, సాజిత్, మధుసూదన్ రావు, మునిరాజా యాదవ్, చింతపూడి ధనంజయులు, సుబ్రహ్మణ్యం, మస్తాన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



## రేణుకా మాత తిరునాళ్లు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం మేజర్ పంచాయతీ సుద్దుగుంట గ్రామంలో వెలసిన ఆదిపరాశక్తి రేణుకా మాత ఆలయంలో తిరుణాల సందర్భంగా బుధవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించి అంబలి నైవేద్యం సమర్పించారు. ఆలయం వద్ద పుట్టకథ, మైలు ముగ్గు కార్యక్రమాన్ని నిర్వహించి నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర దృశ్యం మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ, గ్రామం పూర్తి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఉభయ దాతలుగా కీర్తిశేషులు ఉసురుపాటి గంగస్వామి, వెంకటమ్మ, వారి కుమారులు ఉసురుపాటి రామ్మూర్తి, ఉసురుపాటి సంతానం గౌరీ వారి కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ గాయత్రికి ఫెలోషిప్ అవార్డు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** స్విమ్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఎండోక్రినాలజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గాయత్రి కి అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ ఎండో క్రినాలజి (ఫేస్) ప్రతిష్టాత్మకమైన ఫెలోషిప్ అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ ఈనెల 11న అమెరికాలోని లూసియానాలో న్యూ ఓర్లిన్స్‌లో జరిగిన అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ క్లినిక్ ఎండోక్రైనాలజిస్ట్ వార్షిక సదస్సులు పాల్గొని ఈ ఫెలోషిప్‌ను అందుకున్నానన్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డు అందుకున్న వారిలో ముగ్గురు భారతీయులు ఉన్నారని, స్విమ్స్ వైద్యులు గాయత్రి ఉండ డం చాలా సంతోషంగా ఉందని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ అలోక్ సచిన్ ప్రత్యేకంగా గాయత్రిని అభినందించారు.



## అలిపిరి సీఐగా రామారావు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందడుగు వేస్తూ అసాంఘిక కార్యక్రమాలు, శక్తులపై ఉక్కు పాదంతో కట్టడి చేస్తామని అలిపిరి పోలీస్ స్టేషన్ సీఐ ఎం.రామారావు అన్నారు. అలిపిరి పోలీస్ స్టేషన్ సిఐగా ఎం.రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిని ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది. సత్య సాయి జిల్లా పుట్టపర్తి ఎన్నికల సెల్ విధుల నిర్వహిస్తూ బదిలీపై అలిపిరి సిఐగా నియమితులయ్యారు. కర్నూలు జిల్లా నందికొట్కూరు కు చెందిన సాధారణ కుటుంబంలో జన్మించిన రామారావు 2009లో ఎస్సైగా పోలీస్ విధులు చేరారు. ప్రజలకు అందుబాటులో నిబద్దలతో విధులు నిర్వహిస్తామని సిఐగా బాధ్యతలు చేపట్టిన రామారావు తెలిపారు.



# వెంకట సుధీర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం నేత బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి 45వ జన్మదిన సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణం ఆలయంలో బొజ్జల సుధీర్ రెడ్డి పేరు మీద అమ్మవారికి అభిషేకము, అర్చన, చేసి 101కొబ్బరికాయలతో రమేష, వజ్రం కిషోర్ ఆధ్వర్యంలో మొక్కులు తీర్చుకోవడం జరిగింది. సందర్భంగా కాసరం రమేష్ మాట్లాడుతూ రెడ్డి 45వ జన్మదిన సందర్భంగా పెద్ద ఎత్తున ముత్యాలమ్మ ఆలయం వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తల కోలాహలం మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకమని, ఈ సార్వత్రిక ఎన్నికల్లో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని శ్రీకాళహస్తి ప్రజలు విశ్వసించారు. అని,అందుకు 80 శాతం పైచిలుక ఓట్లు పోలు కావడం రెడ్డి విజయానికి ఒక సంకేతమని తెలియజేయడం జరిగింది. గడిచిన 5 సంవత్సరాల కాలంలో అధికార పార్టీ నాయకుల పనితీరుతో శ్రీకాళహస్తి ప్రజలు విసిగి వేసారి పోయి సుధీర్ రెడ్డి పక్షాన నిలబడడం జరిగిందని, అదేవిధంగా రాబోవు 4 వతేదీ వెలువడే ఫలితాలలో విజయఢంకా మోగించే దిశగా సుధీర్ రెడ్డిని శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు శాసనసభ్యుడిగా ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథ చారి, క్లస్టర్ ఇంచార్జ్ కంటా రమేష్, వన్నెకుల క్షత్రియ సాధికార కమిటీ సభ్యులు మిన్నల్ రవి, వాకచర్ల గుర్రప్ప శెట్టి, రేణుకా దేవి, పేట బాలాజీ, ప్రసాద్, లక్కమనేని మధుబాబు, లెనిన్ బాబు, మదన్, ఢిల్లీ బాబు, సుబ్బయ్య, పొలూరు శ్రీనివాసులురెడ్డి, యశ్వంత్, తుమ్మ భరత్, కటికం సుబ్రహ్మణ్యం, ఖాదర్ భాష, అస్మత్, కరీం, వివేక్,రాకేష్, పూల సిద్ధులయ్య, పూల ఆనంద్,చింతపూడి లోకేష్, మధు, కృష్ణమనాయుడు, జయశ్రీ, ఈశ్వరి, పవన్, యాదగిరి, దారపాండు, ధనంజయలు నాయుడు, ముజీబ్, మీర్జా, గంగాలపూడి హరి, వెంకటముని, భారత్, కాసరం శీను, కిరణ్, రాజ పాల్గొన్నారు.



## మహిళ మెడలో నగలు చోరీ

**పలమనేరు, మేజర్‌న్యూస్:** మహిళ మెడలో నగలు చోరీ జరిగిన సంఘటన పలమనేరు గంగ జాతరలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా వీకోట మండలం చింతల కుంట గ్రామానికి చెందిన లేట్ చిన్న రంగప్ప భార్య ముని లక్ష్మమ్మ, పలమనేరు టౌను లక్ష్మీ నగర్ ప్రాంతాల చెందిన బి సుధాకర్ భార్య వసంత 45 గ్రాములు బంగారు మరొకరిది 24 గ్రాముల బంగారు గంగమ్మ గుడి వద్ద టెంకాయలు కొట్టుతున్న సమయంలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తమ మెడలో ఉన్న బంగారు నగలను చోరీ చేశారని బాధితులుపలమనేరు పోలీసుల కు ఫిర్యాదు చేశారు.వెంటనే క్రైమ్ పార్టీజాతరలో దొంగలున్నారు జాగ్రత్త అంటూ మైక్‌లో అనౌన్స్మెంట్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## బొజ్జల సుధీర్ రెడ్డి జన్మదిన సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు

**రేణిగుంట, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదిన సందర్భంగా బుధవారం రేణిగుంట గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రేణిగుంట గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ఎంజీ రెడ్డి వారి బృందం. ఎంజిరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఏడాది బొజ్జల సుధీర్ రెడ్డి ఉమ్మడి కూటమి అభ్యర్థి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే హోదాలో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటూ ఈ పూజ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, గంగమ్మ చైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి పలువురు నాయకులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



## గంగమ్మ దర్శించుకున్న డాక్టర్ కలికిరి మురళిమోహన్

**ఐరాల, మేజర్‌న్యూస్:** గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా పూతలపట్టు టిడిపి, జనసేన, బిజేపి పార్టీలు బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్ గంగమ్మను దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం తవణంపల్లె మండల నాయకుల ఆహ్వానం మేరకు తవణంపల్లె మండల కేంద్రంలో గంగమ్మ జాతర ఉత్సవాల్లో మురళిమోహన్ పాల్గొన్నారు. తవణంపల్లెలో కొలువుదీరిన గంగమ్మను మురళిమోహన్ దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు మురళిమోహన్‌కు ఆశీర్వాదం అందించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు టిడిపి, జనసేన, బిజేపి పార్టీలు బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్, తవణంపల్లె మండల అధ్యక్షులు దిలీప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ మంజూరు చేయండి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**

ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ ను మంజూరు చేయాలని ఎస్‌టియు జిల్లా శాఖ కలెక్టర్‌ను కోరింది. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పిఓ, ఏపీఓ లకు రెండు రోజులు శిక్షణ తరగతులు, మూడు రోజులు ఎన్నికల విధులకు హాజరైన తమకు డ్యూటీ సర్టిఫికెట్‌ను ఇవ్వాలని కోరారు. దీనిపై కలెక్టర్ వారు స్పందిస్తూ సంబం ధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జగన్నాథం, జిల్లా ఆర్థిక కార్యదర్శి కతారి మోహన్ రెడ్డి, నాయకులు రామాంజనేయులు, పి.శ్రీనివాసులు, వాసు, కె.శ్రీనివాసులు, పేరెమి మురళీ మోహన్, టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బొజ్జల సుధీర్ రెడ్డి జన్మదిన సందర్భంగా అన్నదానం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి 45వ జన్మదిన వేడుకలను టిడిపి ఎస్సీసెల్ అధ్యక్షులు వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి అనంతరం అంబలి స్వామి మఠం నందు నిరుపేదల కు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నాయకులు దసరాచారి, సుబ్బయ్య మాట్లాడు తూ జూన్ 4 ఎన్నికల ఫలితాలలో తమ నాయకుడు బొజ్జల సుధీర్ రెడ్డి దాదాపు 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు.ఆయన 45వ జన్మదిన సందర్భంగా పట్టణంలోని పలుచోట్ల భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని వారు తెలియజేశారు. టిడిపి బిజెపి జనసేన ఉమ్మడి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి తమ కుటుంబ సభ్యుడిని ఆయన జన్మదిన వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.



## దీపం రూపంలో దర్శనమిచ్చిన ఏఎం.పుత్తూరు గంగమ్మ

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం ఏఎం పుత్తూరు గంగమ్మ జాతర అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని జ్యోతి గంగమ్మగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించడం జరిగిందన్నారు. మంగళవారం రాత్రి అమ్మవారు ఊరేగింపుగా బయలుదేరి ఏఎం.పుత్తూరులో జ్యోతి గంగమ్మగా కొలువై భక్తులకు దర్శనమిస్తుం దని బుధవారం రాత్రి 9 గంటలకు అమ్మవారి నిమజ్జన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



## ఘనంగా టీడీపీ మండల ఉపాధ్యక్షులు పుట్టినరోజు

**గుడిపాల, మేజర్‌న్యూస్:** గుడిపాల మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్య క్షులు అనిల్‌కుమార్ చౌదరి పుట్టినరోజు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ముందు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని భారీ కేక్‌ను కట్ చేసి పార్టీ కార్యకర్తలకు మంచి పెట్టడం జరిగింది. అనంతరం అన్న క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు , ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా గంగమ్మ నిమజ్జనం

**పలమనేరు, మేజర్‌న్యూస్:** ఈనెల 20, 21, 22 తేదీలలో పలమనేరు తిరుపతి గంగమ్మ జాతర వైభవంగా నిర్వ హించారు. 20న శిరస్సు మేరవణ, 21నగంగమ్మ తల్లి విశ్వరూప దర్శనం, 22వ తేదీ ఘనంగా గంగమ్మ తల్లిని నిమజ్జనా నికి తరలించారు. ఈ మూడు రోజులు గంగమ్మ జాతరఅత్యంత వైభవం గా నిర్వహించారు. కర్ణా టక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి గంగమ్మ తల్లికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. పలమనేరు అర్బన్ సీఐ చంద్రశేఖర్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసులు బందో బస్తుఏర్పాటు చేశారు. గుడి వద్ద ఈవో ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



## మాజీ ఎంపీపీకి ఘననివాళి

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని పెళ్ళకూరు గ్రామానికి చెందిన మాజీ మండల పరిషత్ అధ్యక్షులు మెరిమ్ అదేమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనమైన నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమ ంలో వైసీపీ నాయకులు యాగని జాకబ్, దైవ సేవకు లు రెవ. సుందర్ రాజు, జాన్ పాల్ పాల్గొన్నారు.



## ఘనంగా అంతర్జాతీయ బయోడైవర్సిటీ దినోత్సవం

**యశోద భాయ్ - కన్జర్వేటర్ బయో ట్రీమ్**

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** అంతర్జా తీయ జీవవైవిధ్య దినోత్సవం పురస్కరించు కొని ఎస్వి జూ పార్క్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడేటా డిపార్ట్మెంట్ ఎస్వి జూ పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యా ర్థులకు, బయోడైవర్సిటీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులకు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు అవగాహన సమావేశం నిర్వహించి విద్యా ర్థుల ద్వారా జీవ వైవిధ్యం పై డ్రాయింగ్ ఎస్సే రైటింగ్ నిర్వహించి విజేత అయినా విద్యార్థులకు బహుమతులను ముఖ్యఅతిథిలై న బయోటిన్‌కన్జర్వేటర్ శారదాబాయ్ చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగింది. బయోడైవర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ రిటైర్డ్ డిఎఫ్ఓ ఎస్.ఖాదరవల్లి ఆధ్వర్యంలో జరిగి ందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాంతాబాయి మాట్లాడు తూ జీవవైవిధ్యం ద్వారా ప్రసాదింపబడిన ముఖ్యంగా ఆహార పదార్థాలును, నీటిని మన చుట్టుపక్కల ఉన్న పర్యావరణాన్ని కలుషిత ము చేయకుండా నిరంతరం స్వచ్ఛతగా ఉండే విధంగా మనం కాపాడుకున్నట్లయితే అదే స్థాయిలో ప్రకృతి జీవవైద్యం మనుషుల యొక్క జీవన ప్రమాణాలు పెంచుట ద్వారా



పాటు నిరంతరం ఆరోగ్యకరంగా ఉండే విధంగా మన జీవవైవిధ్యం సమాజం అంద రిని సంరక్షిస్తుందని ఆమె సూచించారు. అలాగే మరో అతిధి ఎస్వి జూ క్యూ బెటర్ టి సెల్వ మాట్లాడుతూ మన జీవన విధానం లో గాలి నీరు పర్యావరణాన్ని స్వచ్ఛతను పెంచడానికి ప్రతి వ్యక్తి తమ దైనందిన జీవితంలో వీలైనంతవరకు ఔషధ మొక్కలను పెంచి తద్వారా జీవరాశులను కాపాడుతూ భూమి యొక్క ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచ డానికి ప్రయత్నం చేయాలని సలహా ఇచ్చా రు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సోష ల్ ఫారెస్ట్ డిఎస్ఓ ధర్మరాజు, ఎర్ర చందనం డీఎఫ్ఓ సురేష్, డిఎఫ్ఓ నాగ భూషణం, ఎస్ జూ అసిస్టెంట్ కన్జర్వేటర్, తిరుపతి బయోడైవర్సిటీ కమిటీ మండల కోఆర్డినేటర్ పి అమర్నాథ్ ( పరివర్తన సేవా సంస్థ) ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఇంటి కోసం అని వంట కోసమని వారి అవసరాల కోసం వృథాగా చెట్లు నరికేస్తు న్నారని అట్ల నరకడం మంచిది కాదని వృథాగా పోయే నీళ్లతో పెరటి మొ క్కల్లో పెంచడం ఎంతో గొప్పని అదేవిధంగా ఇంటికి ఒక చెట్టు నాటితే ఆ ఊరంతా చాలా కలగా ఉంటుం దని ఈ సభ ముఖంగా అమర్నాథ్ చాలా చక్కగా మాట్లాడారు.

ఆర్.చంద్రశేఖర్ తిరుపతిరూరల్ మండలం బయోడేటా (సిఎస్జి ఎన్జీవో) చిట్టిబాబు బయోడైవర్సి కోఆర్డి నేటర్ పాలసముద్రం, అంబు(రూపీ సంజీవ్) కోఆర్డినేటర్ నాగలాపురం, కృష్ణయ్య బిఎంసి కమిటీ మెంబం (చేయూతఎన్జీవో) నాయుడు పేట, డాక్టర్ జివిఎస్ బాబు బయోడైవర్సిటీ కమిటీ మెంబర్ పీలేరు (గ్రేట్ విజన్ సొసైటీ) కే రెడ్డప్ప బీఎంసీ కమిటీ మెంబర్ తిరుపతి, మార్కొండ రెడ్డి బిఎంసి కమిటీ మెంబర్ విజయలక్ష్మి( శ్రద్ధ న్జీవో) గౌరీ, భాగ్య బిఎంసి కమిటీ మెంబర్లు ఎస్వి జూ పార్క్ సిబ్బంది తిరుపతిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు, టీచర్లు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం అందరికీ సర్టిఫికెట్లు మెమోంటోస్ ప్రధానం చేయడం జరిగింది.

## చారిత్రక నేపథ్యానికి ఆనవాళ్లే జాతరలు

**- చిత్తూరు ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** జాతరలు చారిత్రిక నేపథ్యానికి ఆడవాళ్లుగా ఉంటాయని చిత్తూరు ఉమ్మడి పార్టీల ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు.బుధవారం చిత్తూరు నగరం లోని స్థానిక బజారు వీధి లోని నదివీధి గంగమ్మను చిత్తూరు ఉమ్మడి పార్టీల ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ధర్మకర్త సీకే బాబు తనయుడు సీకే కృష్ణారెడ్డి సాదర స్వాగతం పలి కారు. అమ్మవారి దర్శన అనం తరం మాట్లాడుతూ తర తరా లుగా నడివీధి గంగమ్మ జాత రను నిర్వహిస్తూ మన సం స్కృతి, సాంప్రదాయాలను భావి తరాలకు అందిస్తూ వస్తున్నారు. మరీ ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే సీకే బాబు నడివీధి గంగమ్మ జాతరకు సంబంధించి వంశపా రంపర్య ధర్మకర్తగా ఉండడం స్ఫూర్తిదాయకం. మన ఆచార వ్యవహారాలను మేళవింపు చేస్తూ చిత్తూరులో నడివీధి గంగ జాతర జరుపుకోవడం మన సనాతన ధర్మాన్ని ఆవిష్కృతం చేసుకున్నట్లవుతోంది, ఇలాంటి జాతరలు భవిష్యత్తరాలకు దిక్సూచిగా నిలుస్తాయన డంలో సందేహం లేదు. మానవ సమా జాన్ని చల్లగా చూడాలని అమ్మవారిని ప్రార్థించానని అలాగే సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంట లు, సుఖ సంతోషాలతో ప్రజలు వర్ధిల్లేట ట్లుగా చూడాలని గంగమ్మ తల్లిని వేడుకున్నా గంగమ్మ తల్లి కృపాకటా క్షాలతో దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నా దగ్గుమళ్ళ ప్రసాద్ రావు అన్నారు.



నడి వీధి గంగమ్మను దర్శించుకున్న చిత్తూరు ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు

## పేద విద్యార్థులకు నిఘంటువులు పంపిణీ

**తెలుగుదేశం నేత డా.యం.ఉమేష్ రావు**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆధునిక పోటీ ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకోవా లంటే బహు భాషా ప్రావీణ్యత కలిగి ఉండ టం చాలా ముఖ్యమని భావించి, ఈరోజు కొందరు పేద విద్యార్థులకు నిఘంటువులు పంపిణీ చేసినట్లు తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్‌రావు పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్డీయే కూటమి అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్‌రావు ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణం జయరాం రావు వీధిలోని కొత్తకోనేరు యస్టీ కాలనీకి చెందిన విద్యార్థినీ విద్యార్థులకు త్రిభాషా నిఘంటువులు పంపిణీ చేశారు. పేదరికం కారణంగా ఉన్నత చదువులకు దూరం అవుతున్న గిరిజన విద్యార్థినీ విద్యారు లకు భాషాపరమైన అంశాలలో ఎదురవుతు న్న అవరోధాలను అధిగమించడానికి అవసరమైన త్రిభాషా నిఘంటువులను సుధీర్ రెడ్డి సూచనల మేరకు యస్టీ కాలనీ వాసులకు అందిస్తున్నట్లు ఉమేష్ తెలిపారు. ప్రతీ పేద విద్యార్థి తనలోని భాషా నైపుణ్యా లను మెరుగుపరచు కోవాలని ఆశిస్తూ బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి జన్మదినం సంద ర్భంగా ఈ రోజు తమకు నిఘంటువు లు అందించినందు కు గిరిజన విద్యార్థు లు కృతజ్ఞతలు తెలు పుతూ సుధీర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్ష లు తెలియజేశారని ఉమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పురపాలక సంఘం, 18వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, తెలుగుదేశం పార్టీ మైనారిటీ విభాగం నాయ కులు సయ్యద్ చాంద్ బాషా, షేక్ హబీబ్, షేక్ రియాజ్, ప్రొఫెషనల్ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకుడు గాజులభగత్, 18వ వార్డు ప్రధాన కార్యదర్శి తుపాకుల ప్రసాద్, 52 వ బూత్ కన్వీనర్ షేక్ జిలానీ, గులాం అహ్మద్ ఫరూఖి, తెలుగుదేశం పార్టీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్ల మెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్ర శేఖర్, కృష్ణమూర్తి, శివ, సుబ్బ రత్నమ్మ, మారెమ్మ, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.



# కౌంటింగ్ సజావుగా జరిగేందుకు రిటర్నింగ్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి : కలెక్టర్

**తిరుపతి రెవెన్యూ మేజర్‌న్యూస్:** కౌంటింగ్ సజావుగా జరిగేందుకు రిటర్నింగ్ అధికారులు బాధ్యతగా సంబంధిత అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు 7 నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి కౌంటింగ్ సజావుగా జరిగేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని కావున ఉదయం 7 గంటల వరకు కౌంటింగ్ సూపర్వైజర్లు అసిస్టెంట్లు మైక్రో అబ్జర్వర్లు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల లో ఏర్పాటు చేసిన సంబంధిత కౌంటింగ్ కేంద్రంలో అందుబాటులో ఉండాలని, ముందుగా ఈటీబిపీఎస్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, కంట్రోల్ యూనిట్ పోల్ అయిన ఓట్లు లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు కౌంటింగ్‌కు సంబంధించిన ఏజెంట్ల ఏర్పాటు కొరకు కౌంటింగ్ కు మూడు రోజుల ముందు నుంచే దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత రిటర్నింగ్ అధికారులు తమ నియోజక వర్గ పరిధిలోని అభ్యర్థులతో సమావేశం రేపు గురువారం నిర్వహించాలని సూచించారు. స్థలాభావం వలన తక్కువ స్థలం ఉండి, ఎక్కువమంది అభ్యర్థులు పోటీలో ఉన్న సందర్భంలో ప్రాధాన్యతా క్రమంలో ఎవరిని లోపల అనుమతి అనేది తాజా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గుర్తింపు పొందిన జాతీయ పార్టీల అభ్యర్థులు, గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీల అభ్యర్థులు, గుర్తింపు పొందిన ఇతర రాష్ట్ర పార్టీలు ఎవరైతే వారి పార్టీ సింబల్ కేటాయించబడిన అభ్యర్థులు, రిజిస్టర్డ్, గుర్తింపు పొందని పార్టీల అభ్య ర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఇలా స్థలం అందుబాటులో ఉన్న మేరకు నిబంధనల మేరకు అనుమతి ఉంటుందని రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యర్థులు సహకరించాలని కోరారు. కౌంటింగ్ అనేది సంబంధిత రిటర్నింగ్ అధికారి బాధ్యత అని, తప్పక దానిని ఎంతో పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రశాంత కౌంటింగ్ లక్ష్యంగా, పక్కాగా పనితీరు ఉండాలని, కౌంటింగ్ డేటా క్రోడీకరణ, ఎన్కోర్ యాప్ నందు అప్లోడ్ సక్రమంగా సకాలంలో చేయాలని, ఇంటర్నెట్ బ్యాండ్ విడ్త్ సరిచూసుకోవాలి అని అన్నారు. జిల్లా కలెక్టరేట్ నందు మోడల్ కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నామని, ఆన్ హ్యాండ్ ఎక్స్‌పీరియన్స్ వస్తుందని తెలిపారు. కౌంటింగ్ హాల్ నందు కంప్యూటర్లు, ఇంటర్నెట్,



కుర్చీలు, టేబుల్, సిబ్బంది ఏర్పాటుకు సంబంధిత ఆర్ ఓ లు చర్యలు తీసుకోవాలని సూచించారు. 23- తిరుపతి (ఎస్ సి) పార్లమెంట్ నియోజకవర్గ పరిధి లోని సర్వేపల్లి వివరాల, చంద్రగిరి పార్లమెంట్ నియోజకవర్గ వివరాల సమన్వయం సక్రమంగా చేపట్టాలని అన్నారు. ఎక్కడికక్కడ సైన్ బోర్డు ఉండాలని అన్నారు. మీడియా సెంటర్ ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని అన్నారు. సమాచార సమన్వయం కొరకు ప్రతి నియోజక వర్గం నుండి ఒక అధికారిని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి తో సమన్వయం చేసుకుని మీడియా కేంద్రంకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. కౌంటింగ్ అనంతరం ట్రంక్ పెట్టెలో సంబంధిత ఈవిఎం తదితర ఎన్నికల సంబంధిత సామాగ్రి ప్రోటోకాల్ మేరకు రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్రపరచాలి అని ఈవిఎం నోడల్ అధికారికి సూచించారు. పోస్టల్ బ్యాలెట్ టేబుల్ లు గూడూరు 3, వెంకటగిరి 3, సూళ్లూరుపేట 3, చంద్రగిరి 6, తిరుపతి 6, శ్రీకాళహస్తి4, సత్యవేడు 3 ఏర్పాటు ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ధ్యానచంద్ర, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్, డి ఆర్ ఓ పెంచల కిషోర్, రిటర్నింగ్ అధికారులు కిరణ్ కుమార్, నరసింహులు, చంద్రముని, రవిశంకర్ రెడ్డి, నిషాంత్ రెడ్డి, నోడల్ అధికారులు రామ్మోహన్, చంద్ర శేఖర్ రెడ్డి, కోదండ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్, ఇంటర్, సప్లమెంటరీ పరీక్షలు సమన్వయంతో నిర్వహించాలి

## - డీఆర్ఓ పుల్లయ్య



అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న డీఆర్ఓ పుల్లయ్య

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్:** ఈనెల 24 నుంచి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్, పదవ తరగతి సప్లి మెంటరీ పరీక్షలకు సంబంధించి సంబంధిత అధికారులందరూ సమన్వయంతో కలిసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య అన్నారు. బుధవారం ఉదయం పరీక్షల నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం డిఆర్ఓ ఛాంబ ర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ కు సంబంధించి ఉదయం 9 నుంచి 12 వరకు, తిరిగి మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు పరీక్షలు నిర్వ హిస్తారని, అదే విధంగా పదవ తరగతి సప్లమెంటరీ ఉదయం 9:30 నుంచి 12:30 వరకు నిర్వహిస్తారన్నారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి 31 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారని, మొదటి సంవత్సరానికి సంబంధించి 7,442 మంది రెండవ సంవత్సరానికి సంబంధించి 2577 మంది మొత్తం 10,019 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. అదేవిధంగా పదవ తరగతికి సంబంధించి 15 కేంద్రాలలో మొత్తం 2059 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ఇందులో బాలురు 1302, బాలికలు 757 మంది పరీక్ష రాస్తారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు రెవిన్యూ యంత్రాంగం 144వ సెక్షన్ పరీక్షా కేంద్రాల వద్ద విధించడంతోపాటు ఆ ప్రాంతాల్లో జిరాక్స్ కేంద్రాలు మూత వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు అదే విధంగా పోలీస్ శాఖ భద్రత ఏర్పాట్లు కల్పించాలని కట్టుదిట్టమైన భద్రతతో ప్రశ్నాపత్రాలను తరలించాలని అన్నారు. జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్ అధికారులు పరీక్షలకు కావాల్సిన సిబ్బందిని నియమించుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షల కోసం వచ్చే విద్యార్థుల కోసం బస్సులను ఏర్పాటు చేయాలని అవసరమైతే కొంత సమయం ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరేటట్లు చూడాలన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పరీక్షల నిర్వహణ ఉన్నందున నిరంతర విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రశ్నాపత్రాలను తరలించేందుకు పోస్టల్ డిపార్ట్మెంట్ తగిన ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీస్ సిబ్బంది వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అవసరమైనంత మేరకు పోలీసు సేవలను ఉపయోగించుకోవాలని ఏఎస్‌పి ఆరిపుల్ల తెలిపారు. ఈ సమన్వయ సమావేశంలో ఆర్ఐఓ సయ్యద్ మౌలా, జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు, వైద్య శాఖ నుంచి డాక్టర్ శిరీష, విద్యుత్ అధికారి కేశవులు, ఆర్టీసీ అధికారి మొగులీశ్వర్, పోస్టల్ అధికారి భాస్కర్, కలెక్టరేట్ సి సూపరిండెంట్ గుణశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కమనీయంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** మండలంలోని చవటకుంట గ్రామంలో వెలసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కళ్యాణోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుల మధ్య శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి కళ్యాణోత్సవం జరపడం చూసిన భక్తులు పరవశించిపోయారు. కళ్యాణోత్సవాన్ని తిలకించిన భక్తులు స్వామి వారికి చదివింపులు ఇచ్చి తన భక్తిని చాటుకున్నారు. చందాదారులకు ఆలయ ధర్మకర్త మిట్టపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి పూలమాలలు వేసి సన్మానించారు. సాయంత్రం దేవర ఎద్దును ఊరేగించారు. ఊరేగింపు కార్యక్రమంలో దేవర ఎద్దుకు పూజలు చేసి హారతులు ఇచ్చారు ధర్మకర్త మిట్టపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి




# ప్రైవేటు ఆసుపత్రులు తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

## - సూర్య కథనానికి స్పందన

**వి.కోట, మేజర్‌న్యూస్:** వి.కోట మండల కేంద్రంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్స్ ల్యాబ్ సెంటర్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. "ఆసుపత్రుల పేరుతో బడా మోసం" అనే శీర్షికన బుధవారం సూర్య దినపత్రికలో కథనం వెలువడింది. దీనికి స్పందించిన డీఎంహెచ్ఓ ప్రవేట్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. కొన్ని ప్రైవేట్ హాస్పటల్లో లైసెన్స్ లేనందువల్ల సోకాజ్ నోటీసు ఇవ్వడం జరిగిందనీ, ప్రైవేట్ ఆర్ఎంపి క్లినిక్ నందు సెలైన్ బాటిల్లు ఐవి సెట్లు ఇంజక్షన్లు ఉండడం గమనించి క్లినిక్‌ను సీజ్ చేయడం జరిగిందనీ, ఫార్మసీ సెంటర్లు కూడా తనిఖీ చేశామని, ఆర్ఎంపీ డాక్టర్లు ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలని ట్రీట్మెంట్ చేయరాదని, అటువంటి వాటిపై కఠినా చర్యలు తప్పవని డాక్టర్ ప్రభావతి దేవి అన్నారు. ఈరోజు దాదాపు 8 సెంటర్లను తనిఖీ నిర్వహించారు. నమోదు, డ్రగ్స్ వాడడానికి గుర్తింపు, బయో మెడికల్ వేస్టేజ్, ఎం.టి.పి, పిఎం.టి.పి, యాక్టు 1994 చట్టానికి లోబడి.మరెన్నో ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం ఆసుపత్రిని కొనసాగించాల్సి ఉంటుందని అన్నారు. ఆర్ఎంపిలకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని కానీ క్లినిక్ నందు సెలూన్ బాటిల్స్ హైవి సెట్లు ఉన్నందున సీజ్ చేయడం జరిగిందని, మరికొందరు అధికారులు వస్తున్నారని ముందుగానే షట్టర్ తాళం వేసి వెళ్ళిపోయారనీ,వీరిపై నిగా ఉంచి మళ్లీ తనిఖీ చేస్తామని ఆమె అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంట జిల్లా వైద్య సిబ్బంది ఉన్నారు.

జనం కోసమే సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

# సీఎస్‌ను తక్షణం బదిలీ చేయాలి

### కేంద్ర ఎన్నికల సంఘానికి కిరణ్ రాయల్ విజ్ఞప్తి




**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని వెంటనే బదిలీ చేయాలని, రాష్ట్రంలో ప్రశాంతంగా ఎన్నికల కౌంటింగ్ చేపట్టేందుకు సహకరించాలని, దీనికోసం జనసేన పార్టీ తరపున ఎన్నికల సంఘానికి లేఖ రాశామని జనసేన పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి కిరణ్ రాయల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో జరిగిన హింసాత్మక ఘటనలకు కారణం సిఎస్ జవహర్ రెడ్డి అని ఆరోపించారు. ఎన్నిసార్లు ఎన్నికల సంఘానికి లేఖల ద్వారా విన్నవించిన ఆయనను ఆ స్థానంలో ఉంచడంతో అనుమానాలకు ఉన్నాయన్నారు. కౌంటింగ్ రోజున కూడా హింసాత్మక ఘటనలు చోటుచేసుకుండ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరగాలంటే ఆయనను వెంటనే ఆ పదవి నుంచి తప్పించాలని కోరారు.

శ్రీపద్మావతి మహిళా వర్సిటీ లో పులివర్తి నానిపై హత్యాయత్నం ఘటనలో పాల్గొన్న పి.సుధాకర్ రెడ్డికి బదులు తిరుమల వాసి అయినఅమాయకుడైన ఏ.సుధాకర్ రెడ్డిని అరెస్టు చేసి హత్యయత్నం కేసు నమోదు దారుణం అన్నారు. సిట్ విచారణపై ఏమాత్రం విశ్వాసం కలుగలేదన్నారు. ఎవరికీ తెలియకుండా సిఎస్ జవహర్ రెడ్డి విశాఖపట్నం ఎందుకు వెళ్లారన్నారు. ఎలక్షన్ కమిషన్ జవహర్ రెడ్డి విషయంలో ఎందుకు ఆయనను వెనకేసుకొస్తుందో అర్థం కావడం లేదన్నారు. ఇకనైనా ఎన్నికల సంఘం సిఎస్ జవహర్ రెడ్డిని ఆ స్థానం నుండి తప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు ఆకేపాటి సుభాషిని, సుమన్ బాబు, మునస్వామి, పార్థు, కిషోర్, ఆది, భాను పాల్గొన్నారు.

## గ్రంథాలయంలోని భాండాగారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** గ్రంథాలయంలో ఉన్న భాండాగారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలుగు ఉపాధ్యాయురాలు ముని లక్ష్మి అన్నారు. కార్వేటి నగరం గ్రంథాలయంలో జరుగుతున్నటువంటి వేసవి శిక్షణ శిబిరానికి బోధకురాలుగా ముని లక్ష్మి టీచర్, విచ్చేసి తెలుగు గ్రామరు బోధించినారు. తెలుగులో ఉన్నటువంటి అచ్చులు హల్లులు, వ్యతిరేక పదాలు, అర్థాలు, సందులు, సమాసాలు వాడడం గురించి తెలిపినారు పద్యాలుకు భావాలు, తెలియచేసినారు. తెలుగు గ్రామర్ గురించి బోధించినారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయా ధికారి శంకర్ బాబు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఘనంగా ముగిసిన ఫాల్గుణ పౌర్ణమి ఉత్సవాలు

### శివాలయం చుట్టూ సామూహిక ప్రదక్షణలు నిర్వహించిన భక్తులు



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** మండలం లోని అనుప్పల్లి పంచాయతీ రేకల చేను గ్రామ సమీపాన వెలసిన శ్రీ జన్మస్థల శివాలయంలి నందు రాత్రి ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుండి దాదాపు 600 మంది భక్తులు హాజరయ్యారు ముఖ్యంగా తిరుపతి నుండి 40 మంది భక్తులు వారి కుటుంబాలతో సహా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు స్వామీజీలు పాల్గొని, ఘనంగా నిర్వహించిన పౌర్ణమి ఉత్సవాల తీరును చూసి తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. శ్రీ ప్రతాప్ స్వామీజీ, ఏకవీరా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు , ప్రసంగం, శ్వేత చంద్ర మౌళి, ప్రవచనం, ప్రముఖ పతంజలి యోగ గురువు ప్రభాకర్ శెట్టి , యోగ ధ్యానం యొక్క విశిష్టత గురించి ఉపన్యాసం, సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక హారతి గోకులా పురం, ఉప్పిలి వంక, అనుపల్లి, బ్రాహ్మణపల్లి భక్తులచే నిర్వహిం చిన భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలకు విచ్చేసిన భక్తులందరికీ నిర్వాహకులు భోజన వసతి ఏర్పాటు చేశారు. పరమశివునికి ప్రత్యేక అభి షేకాలు పూజలు, శివాలయం చుట్టూ సామూహిక ప్రదక్షిణలు నేతి గిన్నెలో చంద్ర దర్శనం, చంద్రునికి సామూహిక హారతి పౌర్ణమి హెూమం నిర్వహించారు. పౌర్ణమి ఉత్సవాలలో పాల్గొన్న ప్రముఖులందరికీ శ్రీ జన్మస్థల క్షేత్ర అభివృద్ధి కమిటీ సభ్యులు సత్కరించి భక్తులకు ధన్యవాదాలు తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి రావడం తథ్యం



**గుడిపాల, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఎన్డీఏ కూటమికి బ్రహ్మరథం పట్టారు. ఇందుకు నిదర్శనం ఎన్నడు లేని విధంగా పోలింగ్ శాతం పెరగడం మరియు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పై ఉన్నటువంటి వ్యతిరేకత స్పష్టంగా అర్థమవుతుంది. ప్రజలు ఉదయించే సూర్యుడికి నమస్కారం చేస్తారు కానీ అస్తమించే సూర్యుడికి నమస్కారం చేయరు కదా. అదే విధంగా ఉదయించే సూర్యుడు నారా చంద్రబాబునాయుడు అస్తమించే సూర్యుడు జగన్మోహన్ రెడ్డి జోష్యం చెప్పారు. జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి 12 నుండి 13 మంది ఎన్డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్తూరు నియోజకవర్గంలో తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్ మోహన్ నాయుడు 20వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తారని తెలిపారు.

# బీజేపీ పొత్తు లేకుంటే టీడీపీకి మరిన్ని సీట్లు

### మీడియా సమావేశంలో మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**

తెలుగుదేశం పార్టీ బిజెపితో పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేసి ఉంటే ఆ పార్టీకి మరిన్ని సీట్లు దక్కే అవకాశం ఉండేదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. బుధవారం ప్లస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తరువాత జరిగిన ఘటనలతో ఈవీఎంలను మార్చే ప్రమాదం కూడా పొంచి ఉందని మాజీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ఏ మొహం పెట్టుకొని ప్రజల వద్దకు వచ్చి ఓట్లు అడుగుతున్నాడని తనదైన శైలిలో చింతామోహన్ విమర్శనస్త్రాలను ఎక్కుపెట్టారు. పత్రికా స్వేచ్ఛను పూర్తిగా హరించిన మోడీ మీడియాకు సంకెళ్లు వేశారని ఆరోపించారు. మోడీ పదేళ్ల కాల పాలనలో ఏ వర్గానికి చెందిన ప్రజలు అభివృద్ధి చెందారో చెప్పాలన్నారు. ఎన్నికల కమిషన్ పై విశ్వాసం సన్నగిల్లిందని, పోలీసు యూనిఫామ్ వేసుకున్న వ్యక్తి గూడూరు రిజర్వుడు నియోజకవర్గంలో డబ్బుల వాటాలు పంచడం ఏందని ప్రశ్నించారు. సాక్షాత్తు తిరుపతి ఎస్పీ కార్యాలయం వెనుక ఓటుకు నోట్లు పంచుతుంటే సమాచారం అందించిన స్పందించలేని పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఇరు పార్టీల వారు డబ్బులు పంపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్య పాలు చేశారన్నారు.

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పతనం మొదలైందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లతోనే ఆయన భవితవ్యం తేలిపోయిందన్నారు. ఎన్నడూ లేని విధంగా నాలుగు వేల నుంచి రూ.5 వేల కోట్ల రూపాయలు ఎన్నికల కోసం రాష్ట్రంలో ఖర్చు చేశారని, ఈ డబ్బంతా ఎక్కడి నుంచి తెచ్చారో అర్థం కావడం లేదన్నారు. 40 ఏళ్లలో ఎన్నడూ చూడని విధంగా 2024 సార్వత్రిక ఎన్నికలు జరిగాయని, పార్టీ అభ్యర్థులు కేవలం డబ్బులు పంచి ఓట్లు అడిగారే కానీ వారి విధివిధానాలను ప్రజలకు వివరించలేదన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక దశల వారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 150 సీట్లు వస్తాయని, కేంద్రంలో ప్రజలందరూ మెచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు యార్లపల్లి గోపి, నాయకులు పాల్గొన్నారు.

